నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | RAJANNA SIRCILLA

మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

గ్యారెంటీలను అమలు చేయాలి

- యాసంగి పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలి
- కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు అమలయ్యేదాకా ఊరుకునేది లేదు
- ఐదేళ్లలో కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ నయాపైసా తేలే..
- కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ • గంగాధర మండలం గట్టుభూత్కూర్‌లో బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో సమావేశం

గంగాధర, ఫిబ్రవరి 19: అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట మేరకు ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ యాసంగి ధాన్యానికి రూ. 500 బోనస్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్, మహిళలకు ప్రతినెలా రూ. 2500 చొప్పున ఇవ్వాలన్నారు. గంగాధర మండలం గట్టుభూత్కూర్‌లో సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ఐదేండ్లు ఎంపీగా పనిచేసిన బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి నయా పైసా కూడా తేలేదని ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రైతాంగం నీళ్లు, కరెంట్ కోసం అరిగోసపడ్డదన్నారు. యువకులను నక్సల్స్ పేరిట అంతమొందించే పరిస్థితులు ఉండేవన్నారు. తెలంగాణ ఇస్తే కరెంట్ తీగెలపై బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత సీఎంగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నింటా అగ్రగామిగా నిలిపారని చెప్పారు. 7778 మెగావాట్లు ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 26 వేల మెగావాట్లకు పెంచి 24 గంటల కరెంట్ ఇచ్చారన్నారు. 1.61 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశారని పేర్కొన్నారు. ఎన్నికలకు వారం ముందే రైతుబంధు కోసం రూ.7,700 కోట్లను సమకూర్చిపెట్టారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటినా రైతుబంధు నగదు జమ చేయకపోవడం విడ్డూరమన్నారు. కేసీఆర్ బంగారు పల్లెంలో పెట్టి రాష్ట్రాన్ని అప్పగిస్తే, కాంగ్రెస్ సర్కారు పాలన చేతగాక నిర్వీర్యం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కష్టపడ్డ కార్యకర్తలను కడపులో పెట్టి కాపాడుకుంటామని హామీ ఇచ్చారు.

చేనేత చీరను పరిశీలిస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

చేనేత వస్త్రాలను ఆదరించాలి

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు చేనేత వస్త్రాలను ఆదరించాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. జిల్లాలోని చేనేత సహకార సంఘాల ప్రతినిధులు సోమవారం కలెక్టర్‌ను ఆమె చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా చేనేత ఉత్పత్తులను పరిశీలించి, కార్మికుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి సోమవారం ప్రభుత్వ అధికారులంతా చేనేత వస్త్రాలు ధరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే, ప్రజావాణి సమయంలో కలెక్టరేట్‌లో చేనేత వస్త్రాల స్టాళ్లు ఏర్పాటు చేసుకుని, విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ ఏడీ చరణ్, తదితరులు పాల్గొన్నారు.

పదిహేడేండ్ల పోరాటం ఫలించింది

- మీవోళ్లకు విముక్తి లభించింది
- ఈ నెలాఖరుకల్లా ఇంటికొస్తరు
- అవసరమైతే నేనే తీసుకొస్తా
- బాధిత కుటుంబ సభ్యులతో మాజీ మంత్రి కేటీఆర్
- ఫోన్‌లో మాట్లాడి భరోసా

ఫోన్‌లో కేటీఆర్ మాటలను వింటున్న మల్లేశం, రవి కుటుంబసభ్యులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19: 'పదిహేడేండ్ల పోరాటం ఫలించింది. మస్కోళ్లకు దుబాయ్ కోర్టు క్షమాభిక్ష పెట్టింది. వారిని ఇంటికి తోలుకస్త. ఈ నెలఖారుకల్లా వస్తరు. ఫ్లయిట్ టికెట్లు తీసుకొని, అవసరమైతే నేను దుబాయ్ పోయి తీసుకొస్త. మీరేం బాధపెట్టుకోవద్దు' అంటూ దుబాయ్ కోర్టు క్షమాభిక్ష పెట్టిన బాధితుల కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ భరోసా కల్పించారు. ఈ మేరకు సోమవారం ఓ మీడియా ప్రతినిధి సాయంతో వారితో మాట్లాడారు. ఓ హత్య కేసులో దుబాయ్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్న సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరుకు చెందిన శివరాత్రి మల్లేశం (48), శివరాత్రి రవి (45) అన్న దమ్ములతోపాటు కోనరావుపేటకు చెందిన దండుగుల లక్ష్మణ్ (48), చందుర్తికి చెందిన నాంపల్లి వెంకటి (48), జగిత్యాల జిల్లా మానాలకు చెందిన శివరాత్రి హన్మంతు (51)కు కేటీఆర్ కృషితో విముక్తి లభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే దండుగుల లక్ష్మణ్ విడుదలయ్యాడు. మానాలకు చెందిన శివరాత్రి హన్మంతు రెండ్రోజుల క్రితమే స్వదేశానికి వచ్చాడు. అలాగే పెద్దూరుకు చెందిన శివరాత్రి మల్లేశం, శివరాత్రి రవి రెండ్రోజుల కింద విడుదల కాగా, ఈ నెలాఖరుకల్లా స్వదేశానికి రానున్నారు. మరో వ్యక్తి నాంపెల్లి కూడా త్వరలోనే విడుదలై రాబోతున్నాడు. ఈ క్రమంలో సోమవారం పెద్దూరుకు చెందిన శివరాత్రి రవి, మల్లేశం కుటుంబసభ్యులతో ఓ మీడియా ప్రతినిధి ద్వారా కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. కేటీఆర్ మాటలను విన్న మల్లేశం తల్లి గంగవ్వ కన్నీటి పర్యంతమైంది. 'సార్ మీ దయతోనే కొడుకుల కండ్ల చూడబోతున్నం. చాలా సంతోషంగ ఉన్నది. మీ మేలు ఎన్నిటికీ మరువం' అంటూ కృతజ్ఞతలు తెలిపింది. 'మన పోరాటం ఫలించింది. మస్కోళ్లను వెనక్కు తీసుకొస్త. స్వయంగా ఎయిర్‌పోర్టుకు వస్త. మీ కొడుకులను మీకు అప్పజెప్పుత' అని మంత్రి ఫోన్‌లో భరోసానిచ్చారు.

తల్లిదండ్రులకు శిశువును అప్పగిస్తున్న పోలీసు అధికారులు

24 గంటలు.. 107 సీసీ ఫుటేజీలు

పసికందు కిడ్నాప్ కథ సుఖాంతం

మూడు రోజుల పసికందు కిడ్నాప్ ఘటన సుఖాంతమైంది. 24 గంటల్లోనే శిశువును తల్లిదండ్రులకు అప్పగించడంతో పోలీసుల పనితీరుపై ప్రశంసల వర్షం కురిసింది. కిడ్నాప్ అయిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు మొత్తం 107 సీసీ ఫుటేజీలను వడపోసి, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. పిల్లలు లేకపోవడంతో ఆర్ఎంపీ ఇచ్చిన సలహా మేరకు ఓ మహిళ పసికందును అపహరించిందని గుర్తించారు.

కరీంనగర్ రాంనగర్/ పాలకుర్తి , ఫిబ్రవరి 19: కరీంనగర్ టౌన్ ఏసీపీ ఆఫీసులో సోమవారం ఏసీపీ నరేందర్ వివరాలు వెల్లడించారు. ఆదివారం ఉదయం కరీంనగర్ మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) నుంచి పాప అపహరణకు గురైందనే సమాచారం మేరకు పోలీసులు హాస్పిటల్‌కు వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. టూ టౌన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్ నేతృత్వంలో నాలుగు టీంలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దవాఖాన చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా, ఓ మహిళ చిన్నారిని తీసుకెళ్లినట్లు గుర్తించారు. పాప తల్లికి సమీప బంధువైన 12 ఏండ్ల బాలుడు ఆ పసికందును ఎండకు ఉంచడం కోసం దవాఖాన బయట ఉండగా, అదే సమయంలో సదరు మహిళ పాపకు వ్యాక్సిన్ చేయిస్తానంటూ బలవంతంగా చేతుల్లోంచి తీసుకెళ్లింది. అడిగినా ఇవ్వకుండా అక్కడి నుంచి జారుకున్నది. మంచిర్యాల చౌరస్తా దాకా నడుచుకుంటూ వెళ్లి ఆటో ఎక్కి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆటో డ్రైవర్‌ను అడుగగా, నాకా చౌరస్తా వద్ద దిగి బస్సు ఎక్కిందని చెప్పాడు. వెంటనే బస్టాండ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించగా జమ్మికుంటకు బస్సులో వెళ్లింది. వెంటనే అక్కడి పోలీసులను అప్రమత్తం చేశారు. వారు జమ్మికుంట బస్టాండ్‌లో సీసీ కెమెరాలను పరిశీలించి నిందితురాలు పట్టణానికి చెందిన ముక్కెర కవిత అలియాస్ పద్మగా నిర్ధారించుకున్నారు. విచారణ జరపగా ప్రస్తుతం ఆమె పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లిలో ఉంటున్నట్టు గుర్తించారు. ప్రత్యేక బృందం సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు అక్కడకు వెళ్లి, నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. పాపను తీసుకొని వెంటనే కరీంనగర్ దవాఖానకు తరలించి వైద్యులకు అప్పగించగా, తర్వాత వారు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. కాగా, కవితను విచారించగా, పెళ్లయి చాలాకాలంగా పిల్లలు లేకపోవడంతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని చెప్పింది. ఈ క్రమంలో ఆర్ఎంపీ డాక్టర్ ఎర్రమరాజు జగ్గం రాజును సంప్రదించగా, ఆయన సలహా మేరకు పాపను కిడ్నాప్ చేశానని అంగీకరించింది. దాంతో ఆర్ఎంపీ రాజును కూడా అదుపులోకి తీసుకొని నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేస్తామని ఏసీపీ తెలిపారు. ఈ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన టూటౌన్ ఇన్స్పెక్టర్ బృందంతోపాటు టాస్క్‌ఫోర్స్ స్పెషల్ బ్రాంచ్ జమ్మికుంట పోలీసులను అభినందించారు. మొత్తం వందకు పైగా సీసీ కెమెరాలు పరిశీలించి ఛేదించారని చెప్పారు. ఇక్కడ సీఐలు వెంకటేశ్ సృజన్‌రెడ్డి, రవికుమార్, ఎస్ఐ కిరణ్‌రెడ్డి ఉన్నారు.

ముక్కెర కవిత అలియాస్ పద్మ

ఆదివారం ఎంసీహెచ్‌లో బాలుడి చేతుల్లోంచి తీసుకెళ్లిన మహిళ

పిల్లలు లేకపోవడంతో ఆర్ఎంపీ సలహా మేరకు అపహరణ

రంగంలోకి పోలీసులు.. ఇద్దరు నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన టౌన్ ఏసీపీ నరేందర్

పాటలు పాడుతున్న సింగర్ సునీత

అలరించిన సంకీర్తనలు

సింగర్ కారుణ్య

కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి సప్తమవార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ప్రముఖ గాయని సునీత, గాయకుడు కారుణ్య స్వామి వారి సంకీర్తనలతో శ్రోతలను అలరించారు. ఈ సందర్భంగా గాయని సునీత మాట్లాడుతూ, తనకు కరీంనగర్ మరో పుట్టినిల్లు లాంటిదని, ప్రతి బ్రహ్మోత్సవాలకు రావడం స్వామి అనుగ్రహంతోనే నని చెప్పారు.

- కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 19

చేనేత చీరను పరిశీలిస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కాంగ్రెస్ నాయకుల కొట్లాట

- పెద్దపల్లిలో ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం
- ఎమ్మెల్యే సమక్షంలోనే తోపులాట
- పరస్పరం దాడులు చేసుకున్న అనుచరులు
- చెదరగొట్టిన పోలీసులు

కౌన్సిలర్ శ్రీనివాస్‌ను వారిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాంగ్రెస్‌లో అంతర్గత విబేధాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పెద్దపల్లి ఎమ్మెల్యే సమక్షంలోనే బహిర్గతమయ్యాయి. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇద్దరు కౌన్సిలర్లు పరస్పరం తోసుకోగా, కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. గొడవ జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే వెళ్లిపోగా, చివరకు పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. హస్తం నేతల తీరుపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గొడవల సంస్కృతి మొదలైందని చర్చికుంటున్నారు.

పెద్దపల్లి, ఫిబ్రవరి19 : పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం రెండు ట్రాక్టర్లను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే విజయరమణారావు వచ్చారు. కొబ్బరి కాయలు కొట్టే క్రమంలో కౌన్సిలర్లు నూగిళ్ల మల్లయ్య, కొలిపాక శ్రీనివాస్ మధ్య తోపులాట జరిగింది. ఎమ్మెల్యే పక్కనున్న శ్రీనివాస్‌ను పక్కకు జరుగాలని మల్లయ్య చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైంది. పోలీసులు అదుపు చేయడంతో ఎమ్మెల్యే ట్రాక్టర్లను ప్రారంభించారు. అనంతరం పెద్దపల్లి బల్దియా 2024 -25 బడ్జెట్ ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. తొలిసారిగా మున్సిపల్‌కు వచ్చిన ఎమ్మెల్యేను కౌన్సిలర్లు శాలువాలతో సన్మానిస్తున్న క్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లను ఎందుకు ముందు పిలుస్తున్నారని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్‌ను కౌన్సిలర్ శ్రీనివాస్ ప్రశ్నించారు. అంతేకాకుండా మున్సిపల్ కమిషనర్ తమ వార్డులో పనులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. ఆ తర్వాత బడ్జెట్ సమావేశం జరుగుతున్న సమయంలో ఆ ఇద్దరు కౌన్సిలర్లకు సంబంధించి అనుచరులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడి వెళ్లిపోయే క్రమంలో కొంత మంది లోపలికి వెళ్లి కొట్టుకున్నారు.ఎమ్మెల్యేతోపాటు శ్రీనివాస్ బయటికి వచ్చారు. మల్లయ్య అనుచరులు దాడి చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో విజయరమణారావు గెలుపు కోసం తాము పని చేశామని, ముదిరాజ్‌లను మున్నూరుకాపులు అణగదొక్కుతున్నారనిఎమ్మెల్యేకు చెప్పారు. అయితే గొడవ జరుగుతుండగానే ఎమ్మెల్యే వాహనం ఎక్కి వెళ్లిపోయారు. అనంతరం ఇరువర్గాల అనుచరులు దాడులకు పాల్పడగా, సీఐ కృష్ణ ఎస్ఐ లక్ష్మణ్‌రావు, మల్లేశ్, పోలీసులు చెదరగొట్టారు. శ్రీనివాస్‌తోపాటు ఆయన అనుచరులను మున్సిపల్ కార్యాలయం నుంచి బయటికి వెళ్లగొట్టి గేటు పెట్టారు. గేటు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీనివాస్, మల్లయ్య ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

మమ్మీ వెళ్లొస్తా..

- కాలేజీకి వెళ్తుండగా లారీ ఢీకొని డిగ్రీ విద్యార్థిని మృతి • ఇంటి నుంచి వెళ్లిన కాసేపటికే ప్రమాదం • కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు

కరీంనగర్ రాంనగర్, ఫిబ్రవరి 19: మమ్మీ కాలేజీకి వెళ్లొస్తానంటూ సంతోషంగా బయలుదేరిన డిగ్రీ విద్యార్థిని అంతలోనే ప్రాణాలు కోల్పోయింది. ఇంటి నుంచి స్కూటీపై వెళ్లిన కాసేపటికే లారీ ఢీకొని మృత్యుఒడికి చేరింది. ఇంటి నుంచి సంతోషంగా వెళ్లిన బిడ్డ ఇలా విగతజీవిగా మారడం చూసి కుటుంబసభ్యులు ఒక్కసారిగా గొల్లుమన్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన వాసని జగ్దీశ్, రసీలకు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు. అందులో పెద్ద కూతురు దియా పటేల్ (19) అల్ఫోర్స్ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నది. ఎప్పటిలాగే సోమవారం ఉదయం 9గంటల ప్రాంతంలో తన స్కూటీపై బయలుదేరింది. ఇంటి నుంచి వెళ్లిన కొద్ది సేపటికే బొమ్మకల్ ఫ్లైఓవర్ చౌరస్తా వద్ద గోదావరిఖని నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న దియా పటేల్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే 108 ద్వారా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఆమెను వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అయితే, అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించడంతో మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ ప్రదీప్ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

వచ్చే నెలలో పల్స్‌పోలియో

జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : వచ్చే నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకు నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని అధికారులను జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా ఆదేశించారు. ఐదేండ్లలోపు ప్రతి చిన్నారికీ రెండు చుక్కల పోలియో మందును వేయడంపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. పోలియో మహా మ్మారిని పారదోలేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మార్చి 3న బూత్ స్థాయిలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు చుక్కల మందు వేయాలని, 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి చిన్నారులకు చుక్కల మందు పంపిణీ చేయాలన్నారు. రెండు రోజుల ముందు నుంచే గ్రామాల్లో టాం-టాం ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రయాణ సమయంలో ఉన్న చిన్నారులకు ఆయా బస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల బూత్‌లలో పోలియో చుక్కలు వేసే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్టీసి డిపో మేనేజర్లను ఆదేశించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ దివాకర, డీఎంహెచ్‌వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తాం

- ఉమ్మడి జిల్లా డీటీసీ పురుషోత్తం
- బాధ్యతలు స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న డీటీసీ పురుషోత్తం

తిమ్మాపూర్, ఫిబ్రవరి 19: వాహనదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం తెలిపారు. ఆ మేరకు రవాణా శాఖ కార్యాలయాల్లో ప్రక్షాళన చేపడుతామని స్పష్టం చేశారు. రవాణా శాఖ తరపున ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రవాణా శాఖ తరపున రెవెన్యూ టార్గెట్‌ను వంద శాతం పూర్తి చేసి, తమ లక్ష్యాన్ని అధిగమిస్తామని చెప్పారు. హనుమకొండ నుంచి బదిలీపై వచ్చిన ఆయన, సోమవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా డీటీసీగా తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఉమ్మడి జిల్లాలోని ఎంవీఐలు, రవాణా శాఖ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమ్మక్క జాతరకు వెళ్లే వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డుపై ప్రయాణించే వాహనాలు తప్పకుండా రవాణా శాఖ నిబంధనల మేరకు అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. అధికారులు తనిఖీ చేసినప్పుడు వాహన టాక్సీ, ఫిట్నెస్, డ్రైవర్ లైసెన్సు, వాహన ఇన్సూరెన్స్‌తో పాటు అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని, లేని పక్షంలో సీజ్ చేసి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కాగా, డీటీసీతోపాటు ఎంవీఐలు రవికాంత్, శ్రీకాంత్, ఏఎంవీఐ స్రవంతి బాధ్యతలు స్వీకరించారు.

మహిమాన్విత క్షేత్రం వేములవాడ

మండపంలో స్వామివారి ప్రసాదాన్ని సుమన్‌కు అందజేస్తున్న ఏఈవో శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 19: రాజన్న ఆలయం మహిమాన్విత క్షేత్రమని, భక్తకోటికి ఇలవేల్పు అని సినీ నటుడు సుమన్ కీర్తించారు. ఇది అత్యంత మహిమగల దేవుడి ఆలయమని, అందుకే వేలాది మంది భక్తులు దర్శించుకుంటున్నారని చెప్పారు. సోమవారం ఆయన వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం నాగిరెడ్డిమండపంలో వేదమంత్రాలతో ఆశీర్వచనం చేయగా, ఏఈవో బ్రహ్మన్న గారి శ్రీనివాస్ వారికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఏఎల్పీకి బెస్ట్ టెక్నాలజీ జాతీయ అవార్డు

అవార్డు అందుకుంటున్న ఏఎల్పీ మేనేజర్ తిరుపతి

రామగిరి, ఫిబ్రవరి 19: సింగరేణి అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌కు 2023-2024కు గానూ బెస్ట్ టెక్నాలజీ మైనింగ్ అండర్ గ్రౌండ్ కోల్ జాతీయ అవార్డు దక్కింది. గతంలో డీప్ అండర్ గ్రౌండ్ కోల్ మైనింగ్‌లో సమర్థత, భద్రత పెంపు, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కూలింగ్, ట్యూబ్ బండిల్ గ్యాస్ మానిటరింగ్ సిస్టమ్‌తో ప్రాజెక్ట్ కేస్ స్టడీని ఏఎల్పీ జీఎం కే వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్ కే నాగేశ్వరరావు అడిషనల్ మేనేజర్ శ్రీకాంత్ సమర్పించారు. పరిశీలించిన నిర్వాహకులు జాతీ య అవార్డుకు ఎంపిక చేశారు. కాగా, ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో సోమవారం జరిగిన సదస్సులో ఏఎల్పీ మైన్ మేనేజర్ ములుకుంట్ల తిరుపతి పురస్కారాన్ని అందుకున్నారు.

బర్డ్ ఫ్లూ వదంతులు నమ్మద్దు

కరీంనగర్ తెలంగాణచౌక్, ఫిబ్రవరి 19 : పౌల్ట్రీ పరిశ్రమను దెబ్బ తీసే కుట్రలో భాగంగా కొందరు బ్లర్డ్ ఫ్లూ వస్తున్నదంటూ సోషల్ మీడియాలో విషప్రచారం చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ సంకిటి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సోమవారం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగలు ముఖ్యంగా సమ్మక్క జాతర జరుగుతున్న నేపథ్యంలో చికెన్, కోడిగుడ్ల ధరను తగ్గించి మధ్యవర్తులు లాభాలను పొందాలనే మోస పూరిత కుట్రలతో పౌల్ట్రీ పరిశ్రమ మీద అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బర్డ్ ఫ్లూ వదంతులను నమ్మవద్దని కోరారు. అనవసరపు వదంతులు సృష్టిస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పౌల్ట్రీ పరిశ్రమకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, జగన్నాథరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.